శ్రీ లక్ష్మీ హయగ్రీవ జ్యోతిషాలయం
న్యూపాల్వంచ , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం
"దైవజ్ఞరత్న", "జ్యోతిర్వాస్తురత్న" శ్రీమాన్ గొడవర్తి సంపత్కుమార్ అప్పలాచార్యులు
M.Tech(CSE), M.A.(జ్యోతిషం)

# ★కర్కాటక సంక్రమణమునకు తర్పణకాల నిర్ణయము★

**కర్కటే తు గతే సూర్యే ప్రవేశ త్పూర్వ మేవ తు**

**త్రింశ ద్వింశ శ్చ ఘటికాః పుణ్యకాల ఇతీరితః॥**

ప్రవేశమునకు ముందు 30 లేదా 20 ఘడియల ముందునుండే పుణ్యకాలం ప్రారంభం. ప్రవేశం తర్వాత పుణ్యకాలం ఉండదు. సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు కర్కాటక సంక్రమణము అగును. ఈ కర్కాటక సంక్రమణమునకు 20 ఘడియల ముందు నుండియే అనగా 8 గంటల ముందు నుండియే పుణ్యకాలము ప్రవేశించును. దీనికి 30 ఘడియలు ముందు నుండియే అనగా 12 గంటల ముందు నుండి కూడ పుణ్యకాలము ఉండునని కొందఱి ఉద్దేశ్యము. ఈ సంక్రమణమునకు ప్రవేశము తరువాత పుణ్యకాలము ఉండదు. ఈ కర్కాటక సంక్రమణము ప్రవేశించిన తరువాత ఉత్తరాయణము పోయి , దక్షిణాయనము వచ్చును. ఈ సంక్రమణము సాధ్యమైనంత వఱకున్ను ప్రవేశా త్పూర్వమే అనగా ఉత్తరాయణ కాలము ఉన్నప్పుడే పితృతర్పణమును చేసికొనుట మంచిది. ఈ సంక్రమణము కూడ రాత్రి 12 గంటలకు ముందు ఎప్పుడు ప్రవేశించినప్పటికిన్ని , అది ముందు రోజుననే లెక్కలోనికి వచ్చును. ఉత్తరాయణము ఉన్నప్పుడే ఈ సంక్రమణమునకు పితృతర్పణమును చేయవలసి యున్నది కాబట్టి ఇంకను సంక్రమణము ప్రవేశము కాకపోయినప్పటికిన్ని దీనికి 20 ఘడియలు అనగా 8 గంటల ముందు నుండియే పుణ్యకాలము వచ్చియున్నది కాబట్టి అది రాత్రి 12 గంటల లోపున ఎప్పుడు ప్రవేశించిన ప్పటికిన్ని ఆ రోజు సాయంత్రము లోపుననే దీనికి పితృతర్పణములను చేయవలసియున్నది. అప్పుడు ఆ రోజు ఉదయము నుండి భోజనము చేయకూడదు. భోజనము చేయుటకు ముందే ఈ పితృతర్పణమును చేయవలయును. భోజనము చేసిన తరువాత పితృతర్పణమును ఎంతమాత్రమున్ను చేయకూడదు. ఈ విధముగా సంక్రమణ ప్రవేశమునకు ముందే పితృతర్పణమును చేయునప్పుడు **"ఆగామి దక్షిణాయన ప్రయుక్త కర్కాటక సంక్రమణ మహాపర్వణి విషువ త్పుణ్య కాలే అక్షయ తృప్త్యర్థం తిల తర్పణం కరిష్యే"** అని సంకల్పమును చేయవలయును. ఒకవేళ రాత్రి 12. గంటల తరువాత సూర్యోదయము లోపున ఎప్పుడైనను సరే ఈ కర్కాటక సంక్రమణము ప్రవేశించినచో అది మరునాటి లెక్కలోనికి వచ్చును. అప్పుడు ఉత్తరాయణ కాలములో దీనికి పితృతర్పణము చేయుటకు వీలుపడదు. రాత్రి భాగములో పితృతర్పణమును చేయకూడదు. కాబట్టి ఉత్తరాయణ కాలము పోయి దక్షిణాయణ కాలము వచ్చినప్పటికిన్ని ఆ మరునాడే అనగా ఆ దక్షిణాయన కాలములోనే దీనికి పితృతర్పణమును చేయవలసివచ్చును. ఇట్టి సమయములో రాత్రిభాగములో దీనికి ఎంత మాత్రమున్ను పితృతర్పణమును చేయకూడదు. అనగా **"ఉత్తరాయణ కాలము పోవునుగదా అనెడి ఉద్దేశ్యముతో ఆ రోజు రాత్రిఎంతమాత్రమున్ను పితృతర్పణమును చేయకూడదు"**అని అర్థము. ఒకవేళ సూర్యోదయమైన తరువాత ఉదయమున 7 లేదా 8 గంటల లోపున ఈ కర్కాట సంక్రమణము ప్రవేశించినచో అప్పటి కింకను ఉత్తరాయణ కాలము ఉండును కాబ ఆ రోజు ఉదయమున సాధ్యమైనంత తొందఱగా ఈ పితృతర్పణమున చేసికొనవలయును. ఇదియే కర్కాటక సంక్రమణమునకు గల నియమములు.

Ph: 9393569333 Email: sampathkumarastro@gmail.com